క్లుప్తంగా

నీటి నిల్వలు దోమలకు ఆవాసాలు



కేశవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: కదిలిక లేని నీటి నిల్వలు దోమల పుట్టుకకు స్థావరాలని సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు తెలిపారు. గురువారం పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని కేశవరం, అప్పనపేట, మల్లపరాజుపేట గ్రామాల్లో అంటువ్యాధుల వ్యాప్తిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి మురుగు నీటి కుంటలు, దోమల లార్వా, దోమల వ్యాప్తి గురించి వివరించారు. దోమల లార్వాను నిర్మూలించడం ద్వారా దోమల వృద్ధికాకుండా చూడాలన్నారు. దోమలవల్ల మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్‌గున్యా, మెదడువాపు వ్యాధి వంటివి వస్తాయని అన్నారు. దోమల వృద్ధి చెందకుండా చూడాలంటే ప్రతీ ఒక్కరూ వారానికోసారి డ్రైడేగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కిడ్నీ సంరక్షణ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పరమేశ్వర్లు

గణపవరం: కిడ్నీ వ్యాధులపై నిర్లక్ష్యం వహించకుండా తక్షణం వైద్య పరీక్షలు, చికిత్స తీసుకోవాలని జిల్లా పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కె పరమేశ్వర్లు అన్నారు. గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా కిడ్నీ వ్యాధులు, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు మండల పీఎంపీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. ఈసదస్సులో ఆయన మాట్లాడుతూ కిడ్నీ వ్యాధులపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. క్రమం తప్పని వ్యాయామం, ఆరోగ్య నియమాలు పాటించడం వంటి చర్యల ద్వారా కిడ్నీ సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండవచ్చునన్నారు. ఈకార్యక్రమంలో మండల పీఎంపీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జనార్ధనస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు



స్వామివారి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

దెందులూరు: మండలంలోని సోమవరప్పాడులోని శ్రీ జనార్ధన స్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు అమ్మవార్లకు వివిధ రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారు దర్శించుకుని అభిషేకాలు పూజలు నిర్వహించారు. నాగమణి దంపతులు కల్యాణం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

కవయిత్రి మొల్లమాంబ జీవితం ఆదర్శనీయం

ఏలూరు (టూటౌన్): కవయిత్రి మొల్ల జీవితాన్ని నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్ల పల్లి జయప్రకాష్ (జేపీ) అన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో మొల్లమాంబ జయంతిని జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవులు, నగర బీసీ సెల్ అధ్యక్షుడు కిలాడి దుర్గారావుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జయప్రకాష్ మాట్లాడుతూ తెలుగులో తొలి కావ్యం రచించిన రచయిత్రి మొల్లమాంబ అని గుర్తు చేశారు. మొల్లమాంబ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు రాజేష్, నగర ఆర్టీఐ విభాగ అధ్యక్షుడు ఫణి, యూత్ నాయకులు వెంకటేష్, రాష్ట్ర మైనార్టీ నాయకులు గాజుల బాజీ, ట్రేడ్ యూనియన్ విభాగ అధ్యక్షుడు శివ, పార్టీ సీనియర్ నాయకులు మల్లిక్, స్వామి, శంకర్ పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

ఏలూరు (టూటౌన్): ప్రతి ఒక్కరూ తమ లక్ష్య సాధనకు కృషి చేయాలని సెట్‌వెల్ సీఈఓ కె.ప్రభాకర్ అన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి నైపుణ్య అభివృద్ధి అవకాశాలపై దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటుచేసిన జిల్లా సదస్సులో ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత నైపుణ్యాలు పెంచుకొని ఉద్యోగ అవకాశాలు అందుపుచ్చుకోవాలని సూచించారు. ఒడిదుడుకులను తట్టుకునే సామర్థ్యాన్ని కలిగి ఉన్నప్పుడే విజయం సాధ్యమవుతుందని వివరించారు. ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వి.వరలక్ష్మి మాట్లాడుతూ జాబ్ మేళాల్లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ ఉన్నవారికే ప్రాధాన్యత ఉంటుందన్నారు.

తల్లికి వందనం పిల్లలకు ద్రోహం

- హామీకి తిలోదకాలిస్తున్న వైనం
- పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏటా రూ.15వేలు ఇస్తానన్న చంద్రబాబు
- ఇప్పటికీ అతీగతీలేని వైనం
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న తల్లులు



కొవ్వలి ఉన్నత పాఠశాల



పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

దెందులూరు: ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే చంద్రబాబు చెప్పేదొకటి..అమలు మరొకటి అన్నట్లుంది..సార్వత్రిక ఎన్నికల సమయంలో తల్లికి వందనం పేరిట పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏటా రూ.15వేలు చొప్పున అందజేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మారుస్తూ ప్రజలను వంచించడానికి సిద్ధమయ్యారు. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఒక్కో తల్లికి రూ.15వేలు చొప్పున మాత్రమే ఇస్తామని చెప్పడంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. అధికారంలోకి రావాలని ఆశ చూపి, అధికారం చేపట్టిన తర్వాత తిలోదకాలు ఇవ్వడం చంద్రబాబు నైజమని సర్వత్రా విమర్శిస్తున్నారు. దెందులూరు నియోజకవర్గం వ్యాప్తంగా 222 మొత్తం పాఠశాలలు ఉన్నాయి. అందులో 39,022 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల వేళ చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు 39,022 మందికి తల్లికి వందనం వర్తింపజేయాల్సి ఉంది. కానీ ఇప్పుడు ఎంత మందిని చదివిస్తున్న ఇంట్లో ఒక్కరికే పథకం వర్తిస్తుందని నిబంధన పెట్టడంతో తలిదండ్రులు మండిపడుతున్నారు. తాజా జీఓ ప్రకారం తల్లికి వందనం పథకం లబ్ధిదారుల్లో భారీగా కోత పడనుంది.

పేదలను ఇలా వంచించారు..

సార్వత్రిక ఎన్నికల్లో గట్టెక్కేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలిచ్చారు. కుటుంబంలో బడికి వెళ్లే విద్యార్థులందరికీ ఏటా ఒక్కొక్కరికీ రూ.15వేలు చొప్పున తల్లికి వందనం పేరుతో ఆర్థిక ఆసరా కల్పిస్తానని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన వెంటనే ప్లేట్ ఫిరాయించారు. తల్లికి వందనం మాట అటుంచితే తల్లికి ద్రోహం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. పథకం అమలుకు సవాలక్ష నిబంధనలు విధిస్తూ కోత విధించేందుకు శ్రీకారం చుట్టారు. పిల్లలందరికీ ఇస్తామని నాడు చెప్పగా నేడు కుటుంబలో ఎంత మంది పిల్లలున్నా ఒక్క తల్లికి మాత్రమే ఏటా రూ.15వేలు చెల్లిస్తామని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీని ప్రకారం ఒక్క విద్యార్థికి మాత్రమే ప్రభుత్వం తల్లికి వందనం ఆర్థిక సాయం అందించనుంది. దీనికితోడు ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు 75శాతం హాజరు ఉండాలన్న నిబంధన పెట్టారు. అన్ని వర్గాలకు కాకుండా దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న తల్లులకు మాత్రమే ఇస్తామంటూ మెలిక పెట్టారు. దీనిపై మధ్య తరగతి వర్గాల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

గతంలో అమ్మబడి కింద ఏటా రూ.77.72 కోట్లు ఖర్చు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన విషయం తెలిసిందే. కులం, మతం, వర్గం పార్టీ చూడకుండా జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా సకాలంలో తల్లులు ఖాతాల్లో నిధులు జమచేసేవారు. దీనికి తోడు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు, జగనన్న విద్యా కానుక, విదేశీ విద్యా దీవెన తదితర అనేక పథకాలు క్యాలెండర్ ప్రకారం అమలు చేసేవారు. పాఠశాలలు తెరిచే సమయానికే ఒక్క అమ్మ ఒడి పథకం ద్వారానే నియోజకవర్గ వ్యాప్తంగా ఏటా 27,923 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.77.72కోట్లు జమ చేసేవారు. విద్యా దీవెన పథకంలో 24082 మంది ఇంటర్ విద్యార్థులకు ఏటా రూ.41.67 కోట్లు అందజేశారు. జగనన్న వసతి దీవెన కింద 22548 మంది విద్యార్థులకు రూ.21.24 కోట్లు అందించారు. ఇలాంటి పథకాలను పక్కాగా అమలు చేయడంతో తల్లిదండ్రులపై పిల్లల చదువుల భారం పడేది కాదు. తల్లికి వందనం సంబంధించి విద్యాశాఖ అధికారులను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. ఉత్తర్వులు వస్తే ఉత్తర్వులు కనుగుణంగా పథకం అమలు జరుగుతుంది.

అందరికీ వర్తింపజేయాలి



పేద పిల్లలకు మంచి భవిష్యత్ అందించే లక్ష్యంతో గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకంను అందరికీ వర్తింపజేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకాచ్చాక ఇంట్లో కేవలం ఒక్కరికీ మాత్రమే తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పడం సరైంది కాదు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీని గెలిచిన తర్వాత కూడా అమలు చేయాలి.

– గొల్ల కిరణ్, కొవ్వలి

స్కూళ్లు తెరవకముందే డబ్బులు పడేవి



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా స్కూళ్లు తెరవక ముందే అమ్మ ఒడి పథకం నగదు బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో రూ.15వేలు ఇస్తామన్నారు. ఇంత వరకూ నగదు జమకాలేదు.

– ప్రసన్నరాణి, అలుగులగూడెం

నియోజకవర్గాలవారీగా

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
దెందులూరు	61	6030
ఏలూరురూరల్	86	13070
పెదవేగి	62	10,082
పెదపాడు	13	9890

వంతెన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

భీమడోలు: మండలంలోని గుండుగొలను వంతెన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని వంతెన సాధన కమిటి కన్వీనర్ సుమన్‌బాబు డిమాండ్ చేశారు. గుండుగొలనులో ఆయన గురువారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. గత మూడేళ్లగా గుండుగొలను వంతెన నిర్మాణం నత్తనడకన సాగుతుందన్నారు. వంతెన నిర్మాణానికి కాంట్రాక్టర్ అలసత్వమే కారణమన్నారు. ఆతని నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, నలుగురు ప్రాణాలు పోయాయని, 23 మందికి గాయాలపాలైయ్యారన్నారు. అయితే అన్ని అడ్డంకులు దాటి వంతెన స్లాబ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో కేంద్ర జల రవాణాశాఖ అనుమతులు నిరాకరణ పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. అన్ని అనుమతులను ఇచ్చి వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి : మండలంలోని పెదవేగి సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కేవీ కవ్వగుంట సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం3గంటల నుంచి సాయంత్రం 6గంటలకు వరకు విద్యుత్ సరఫరా ఉండదని డిఈ కె. ఎం. అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కావును వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

ఉంగుటూరు: మండలంలోని రామన్నగూడెం 11కెవి విద్యుత్ లైన్ కొత్తది వేస్తున్నందున కైకరం డొమిస్టిక్ ఫీడరు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటలు వరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ డిఇ అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే బాదంపూడి రూరల్ ఫీడరుపై మరమ్మతుల చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు డీఈ తెలిపారు. వినియోగదార్లు సహకరించాలని కోరారు.

ఘనంగా ముగ్గురమ్మల జాతర



పిప్పర గ్రామదేవతలు మహాలక్ష్మి, మహంకాళి, బంగారుపాప అమ్మవార్లు

గణపవరం: మండలంలోని పిప్పర గ్రామ దేవతలు ముగ్గురమ్మల జాతర మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈఉత్సవాలు మూడురోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటి ప్రకటించింది. ఉత్సవాల ప్రారంభం రోజైన గురువారం సాయంత్రం అమ్మవార్ల గవళ్లగుడుపు సేవ వైభవంగా జరిగింది. పిప్పర పరిసర గ్రామాల నుంచేకాక మండలంలోని పలు గ్రామాలనుంచి ప్రజలు పెద్దసంఖ్యలో గవళ్ల గుడుపు సేవలో పాల్గొన్నారు. ముగ్గురు అమ్మవార్లను రాత్రి తెల్లవార్లూ గ్రామంలో వీధివీధినా ఊరేగించారు. విచిత్రవేషాలు, బుట్టబొమ్మలు, శక్తి వేషాలు, తీన్‌మార్ వాయిద్యాలు, బ్యాండుమేళాలు, బాణసంచా మోతలతో గవళ్లగుడుపు సేవ అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవాల సందర్భంగా అమ్మవార్ల ఆలయాలకు రంగులువేసి ఆలయ పరిసర ప్రాంతాలను రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పిప్పర పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు మూడురోజులూ అమ్మవార్లను దర్శించుకుని, నైవేధ్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకుంటారు. ఆడపడుచులకు పసుపుకుంకుమలతో పాటు కొత్త చీర పెట్టడం ప్రతీ ఇంటా జరుగుతుంది. ఆడపడుచులు, బంధుమిత్రుల రాకతో గ్రామం కళకళలాడుతుంది.

రొయ్యల రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): రొయ్యకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రొయ్యల కొనుగోలు కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి కొనుగోలు ధరను తగ్గించడం వల్ల రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. గతంలో రూ.45 వేలుగా ఉన్న వనామి రొయ్యల ఫీడ్ ధర నేడు లక్షా ఐదు వేల రూపాయలకు పెరిగిందని తెలిపారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని పెరిగిన ఫీడ్ ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన సీడ్ అందించాలని, ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ ధర రూ.1.50 సబ్సిడీ పథకాన్ని రైతులందరికీ వర్తింపజేయాలని రవి కోరారు.

ఘనంగా శివకేశవుల కల్యాణం



భీమడోలులో పార్వతీ సమేత భీమేశ్వర స్వామి వారి కల్యాణం చేస్తున్న దృశ్యం

భీమడోలు: భీమడోలులో ఒకే వేదికపై ఒకే ముహూర్తానికి శివ, కేశవుల కల్యాణోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని అతిపురాతన దేవాలయాలైన వేంకటేశ్వర స్వామి, శ్రీపార్వతీ సమేత భీమేశ్వర స్వామి వార్ల వార్షికోత్సవాలు ప్రతి ఏటా ఘనంగా నిర్వహించడం సాంప్రదాయబద్ధంగా వస్తుంది. ఈ క్రమంలో కల్యాణోత్సవాల్లో భాగంగా ఆలయాల్లో స్వామి వార్లకు అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. స్థానిక మండపాల వద్ద అర్చకులు ఆధ్వర్యంలో శివ, కేశవులకు కల్యాణ తంతు కన్నుల వేడుకగా జరిగింది. తొలుత ఆలయాల్లోని స్వామి వార్లను పల్లకీ సేవ నిర్వహించి మండపాల వద్దకు తీసుకుని వచ్చారు. అనంతరం శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు చేశారు. కల్యాణంలో పలువురు దంపతులు పీఠాలపై ఆశీన్నులయ్యారు. అర్చకులు ఉమాశంకర్ శర్మ, పవన్‌లు ఒకే వేదికపై శ్రీపార్వతీ సమేత భీమేశ్వర స్వామి, వేంకటేశ్వర స్వామి వారి అలివేలు మంగ, లక్ష్మీ దేవేరులకు ఒకే ముహుర్తానికి మంగళ వాయిద్యాల నడుమ కల్యాణాన్ని జరిపించారు. గ్రామానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. గురువారం వేర్వేరు ట్రాక్టర్లపై స్వామి వార్లను గ్రామోత్సవం చేశారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు.

క్రీస్తు సువార్త మహాసభలపై ప్రచారం

దెందులూరు: పైడిచింతపాడులో ఈనెల 19, 20, 21 తేదీల్లో సీబీసీఎంసీ చర్చి ఆవరణలో జరిగే క్రీస్తు సువార్త మహాసభలను విజయవంతం చేయాలని చర్చి పారిస్ పాస్టర్ రెవరెండ్ మధు అన్నారు. గురువారం దెందులూరు అలుగులగూడెం, ఇతర గ్రామాల్లో మహాసభలపై విస్తృతంగా ప్రచారం చేశారు. గోడపత్రికలు కరపత్రాలు పంపిణీ చేశారు. ఇద్దరు ఇతర ప్రాంతాల నుంచి సువార్తికులు వాక్య పరిచర్య చేయడానికి విచ్చేస్తున్నారని తెలిపారు. దేవుని దీవెనలు పొందాలని పాస్టర్ మధు కోరారు.

రహదారి భద్రతపై అవగాహన అవసరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థి దశ నుంచే రహదారి భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ పి.రమేష్ బాబు అన్నారు. గురువారం స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. రమేష్ బాబు మాట్లాడుతూ రాష్ డ్రైవింగ్ ప్రమాదకరమన్నారు. ద్విచక్ర వాహనాన్ని నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు, వాహన తనిఖీ అధికారి పి.నరేంద్ర బాబు పాల్గొన్నారు.

ముగిసిన నిరీక్షణ జూబ్లీ మహాసభలు

పెదవేగి : క్రీస్తులో నిరీక్షణ జూబ్లీ మహాసభలు న్యాయంపల్లి గ్రామంలో ఆరోగ్య మాత దేవాలయ ఆలయ ప్రాంగణంలో న్యాయంపల్లి విచారణ గురువులు రె.ఫాదర్. రాచూరి బాలస్వామి ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా ఘనంగా నిర్వహించారు. ఈ పరిశుద్ధ మహాసభలు ముగింపు సందర్భంగా విశాఖ అగ్ర పీఠం ఛాన్సలర్ రె. ఫాదర్ జొన్నాడ జాను ప్రకాష్ జ్ఞానాపురం విచారణ, ప్రత్యేక వాక్య పరిచర్య, దివ్యబలి పూజ ఎంతో వైభోపేతంగా జరిపించారు. ఈ పండుగలో న్యాయంపల్లి విచారణ గురువులు రె. ఫాదర్. రాచూరి బాలస్వామి రె. ఫాదర్. క్రీస్తు రాజు (ప్రావిన్షియల్ హెచ్‌జీఎస్), రె.ఫాదర్. బి. ఆశీర్వాదం, రె. ఫాదర్. ఎం జయంతి బాబు,రె. ఫాదర్. డాక్టర్ సీహెచ్ గాబ్రియేలు, రె. ఫాదర్. టి. దివాకర్, సెంట్ అలోసెస్ సిస్టర్స్ మేరీ గ్రేస్ గారు న్యాయంపల్లి విచారణల పరిధిలో ఉన్న దీక్ష సహోదరి సహోదరులు ఉపదేశులు సంఘ పెద్దలు యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ క్రీస్తులో నిరీక్షణ జూబ్లీ మహాసభలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

మహిళా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఏలూరు (టూటౌన్): మహిళా సమస్యలపై ఐద్వా ఆధ్వర్యంలో పలు ఉద్యమాలు, పోరాటాలు చేశామని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.హైమావతి తెలిపారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా స్థానిక పవర్ పేటలోని ఐద్వా భవనం వద్ద గురువారం సంఘం జెండాను హైమావతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కమిటీ సభ్యులు ఎ.శ్యామలారాణి, జె.హరీషా దుర్గ మాట్లాడుతూ సంఘం ఏర్పడి 44 సంవత్సరాలయిందని, సంఘం చేసిన అనేక ఉద్యమాల ఫలితంగా పలు మహిళా చట్టాలు అమలులోకి వచ్చాయని చెప్పారు. సనాతన ధర్మం పేరుతో మహిళను కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. గుడి, బడి అనే తేడాలేకుండా ఎక్కడికక్కడ మద్యం అమ్మడం వల్ల మహిళలు, యువత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్మార్ట్ ఫోన్లతో చెడు సంస్కృతిని అరికట్టాలని, నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. డ్వాక్రా గ్రూపుల ద్వారా పొదుపు డబ్బును తక్కువ వడ్డీలకు అప్పులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జి.స్పందన, ఎం అరుణ్ కుమారి, లక్ష్మి, జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ నిర్మాణాలకు మోక్షమెప్పుడో?



అసంపూర్తిగా ఉన్న జల్లికొమ్మర అంగన్‌వాడీ భవన నిర్మాణం



ఆగిపోయిన బువ్వనపల్లి అంగన్‌వాడీ భవన నిర్మాణం పనులు

- నియోజకవర్గంలో 14 అంగన్‌వాడీలకు నూతన భవనాలు
- తొలివిడతలో రూ 1.05 కోట్లు నిధులు విడుదల చేసిన జగన్ సర్కార్
- రెండో విడత రావల్సిన నిధులు నిలిపేసిన కూటమి సర్కార్

నిడమర్రు: గత ప్రభుత్వంలో నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలతో పాటు చిన్నారుల బడులైన అంగన్‌వాడీ కేంద్ర భవనాలకు సైతం అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గంలో ఫేజ్–2లో 14 అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు గత ప్రభుత్వంలో నాడు– నేడు పథకంలో పారంభించారు. వీటి నిర్మాణాలకు అవసరమైన నిధుల్లో తొలివిడతగా ఒక్కో భవన నిర్మాణానికి సుమారు రూ 7.5లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో అప్పట్లో వీటి నిర్మాణ పనులు వేగంగా జరిగాయి. మలివిడత నిధులు మంజూరుకి అప్పట్లో ఎన్నికల కోడ్ రావడంతో నిధులు విడుదల నిలిచిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. అనంతరం అధికారం చేపట్టిన కూటమి సర్కారు మిగిలిని రెండో విడత నిధులు మంజూరు నిలిపివేయడంతో అవి ప్రస్తుతం గ్రామాల్లో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. తొలివిడత నిధులతో బేస్‌మెంట్, స్లాబ్, గోడలు పూర్తి చేసుకుని ప్లాస్టింగ్, కిటీకీలు, తలుపుల వంటి పనులకు నిధుల కోసం ఆ భవనాలు ఎదురు చూస్తున్నాయి.

నియోజకవర్గంలో 14 అంగన్‌వాడీ కేంద్రాలు

ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి స్వంత భవనం ఉండాలనే లక్ష్యంతో ఫేజ్–2 నాడు–నేడు పథకంలో కొత్తగా అంగన్‌వాడీ భవనాలను వైఎస్సార్ సీపీ సర్కార్ మంజూరు చేసింది. నిడమర్రు మండలంలో నిడమర్రు, పెందనింద్రకొలను, మందలపర్రు, క్రొవ్విడి ఉప్పరగుడెం అంగన్‌వాడీ కేంద్రాలకు, ఉంగుటూరు మండలంలో ఎ.గోపవరం–2, బాదంపూడి అంగన్‌వాడీ కేంద్రాలకు గణపవరంలో జల్లికొమ్మర, సీహెచ్ అగ్రహారం, సరిపల్లి, గణపవరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు, భీమడోలు మండలంలో 4 అంగన్‌వాడీ కేంద్రాలకు స్వంత భవనాలు నిర్మించేలా నాటి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రస్తుతం వాటి పరిస్థితి అసంపూర్తిగా ఉన్నాయి.

నిధులు వినియోగం పారదర్శకంగా..

ఈ అంగన్‌వాడీ కేంద్ర భవనాల నిర్మాణంలో ప్రైవేట్ కాంట్రాక్టర్లు, ఇత ప్రజా ప్రతినిధుల ప్రమేయం లేకుండా నాడు–నేడు పథకంలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కమిటీలో ఆయా పరిధిలోని తల్లులను భాగస్వామ్యం చేస్తూ తల్లుల కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్, సూపర్‌వైజర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు ఉంటారు. వీరి ఆధ్వర్యంలో ఈ భవన నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం ఈ నాడు–నేడు ఖతాలు రెండో విడత నిధుల కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రస్తుతం అవీ అద్దె భవనాల్లో, పాత పంచాయతీ భవనాల్లో, కమ్యూనిటీ సెంటర్లలో పాత గదుల్లో కొనసాగుతున్నాయి. ఇరుకుగా అరకొర వసతులున్న ఆ భవనాలు చిన్నారులను ఆడించాలన్నా, వారికి భోజనం వండి వడ్డించాలన్నా, చదువు చెప్పాలన్నా ఇబ్బందిగా మారిందని తల్లిదండ్రులు చెబుతున్నారు.

పేరును మార్చడంలో ఉన్న శ్రద్ధ అమల్లో ఏది

మన బడి నాడు–నేడు పేరును చంద్రబాబు సర్కార్ పేరును మనబడి–మన భవిష్యత్ పేరుగా ఆ పథకంను మార్చారు. పథకాల పేరు మార్చడంలో ఉన్న శ్రద్ధ అమల్లో కూడా ఉండాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో నాడు–నేడు కింద మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు తొందరగా పూర్తి చేయాలని ఆయా గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాత పంచాయతీ భవనంలో ఉంది



గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–18 ప్రస్తుతం పాత పంచాయతీ భవనంలో కొనసాగుతోంది. గత ప్రభుత్వంలో నాడు–నేడు పథకంలో ఈ కేంద్రానికి నూతన భవనం మంజూరైంది. ఆ నిర్మాణానికి సంబంధించి ఫేజ్–2 రెండో విడత నిధులు విడుదల చేయకపోవడంతో ఆ భవనం ప్రస్తుతం అసంపూర్తిగా ఉంది.

– కురెళ్ల వెంకట రత్నం, సర్పంచ్, జల్లికొమ్మర

అవసమైన నిధులు విడుదల చేయాలి



నాడు–నేడు పథకం ఫేజ్–2లో నిధులు విడుదలై ప్రారంభించిన అంగన్‌వాడీ కేంద్రాల నూతన భవన నిర్మాణాలను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయాలి. అవసరమైన నిధులు త్వరిత గతిన విడుదల చేయాలి. అద్దె భవనాల్లో, పాత పంచాయితీ భవనాల్లో విద్యార్థులు, సిబ్బందికి మోక్షం కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే.

– నౌదు వెంకట రమణ, మాజీ జెడ్పీటీసీ, పత్తేపురం